అభివృద్ధికి దూరంగా గిరిజన తండాలు

- లంబాడీల భాష గోరుబోలిని రాజ్యాంగంలో చేర్చాలి
- భూక్యా నాగేశ్వరరావు నాయక్

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన తండాలు గూడాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఎస్టీ గిరిజన బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరావు నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్టీ బంజారా లంబాడి సుగాలి సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ గిరిజన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. గిరిపుత్రుల జీవనంలో అభివృద్ధి రావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఏదైనా గిరిజనుల పండుగలు గుర్తుకొచ్చినప్పుడే ఆరోజు ప్రభుత్వాలు హడావుడి చేస్తున్నాయి తప్ప తర్వాత వారి బాగోగులు పట్టించుకోవడంలేదని, తండాల్లో ఈరోజుకీ సరైన రోడ్లు, కనీసం బస్సు సౌకర్యాలు లేవని తెలిపారు. వైద్యపరంగా అత్యవసరమైతే ఆటోలపై ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 16 కోట్ల మంది మాట్లాడే గిరిజన లంబాడీల భాష గోరుబోలిని రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఇ.బాలాజీ నాయక్, భూక్య రంగా నాయక్ వెంకటేశ్వరరావు నాయక్ భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న భూక్యా నాగేశ్వరరావు

మినీ ఐటీడీఏలు ఏర్పాటు చేయాలి

స్థానిక ఎస్ఆర్‌పేటలోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ మైదాన ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధికి మినీ ఐటీడీఏను ఏర్పాటు చేయాలని అన్నారు. 500 జనాభా దాటిన గిరిజన గ్రామాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో భూక్యా నాగరాజు నాయక్, దేవరకొండ వెంకటేశ్వరు,పలువురు గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యాశాఖ, ప్రభుత్వం ప్రకటించిన సెలవు కూడా విద్యార్థులకు అందని ద్రాక్షలా మారుస్తున్నాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పట్ల మెతక వైఖరి, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తుండడంతో ఏలూరు నగరంలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం తమ విద్యాసంస్థలను యథేచ్ఛగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను తీవ్రమైన మానసిక ఒత్తిడి గురిచేస్తోందన్నారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ తరపున డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

12న ఎస్సీ సెల్ జిల్లా సమావేశం



మాట్లాడుతున్న పార్టీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఈనెల 12న ఏలూరు కండ్రిగూడెం సుభీభవ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుధీర్ బాబు, జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్ తెలిపారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మానూరులో వారు మాట్లాడుతూ దళితుల సంక్షేమ అభివృద్ధి సామాజిక రాజకీయ గుర్తింపు ప్రాధాన్యత వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని వివరించారు. పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో సమావేశం విజయవంతమవుతుందని అన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి ప్రేమ్ బాబు, సర్పంచ్ కొరపాటి ప్రభుదేవా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక రామకోటి ప్రాంగణంలో డాక్టర్ నగేష్ బృందం శనివారం పేదలకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 92 మందికి పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. నాలుగేళ్లుగా ప్రతినెలా రెండో శనివారం రామకోటి ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని రామారావు తెలిపారు. శిబిరానికి తెలంగాణ, ఆంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యాధిగ్రస్తులు వస్తున్నారని చెప్పారు. వచ్చిన వారందరికీ బొలిశెట్టి సురేష్ కుమార్, లోకేష్, పిల్లి పండరీనాథ్ సేవలు అందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

దెందులూరు: ఏలూరు ఆసుపత్రి వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనం శుక్రవారం అపహరణకు గురైంది. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాంతానికి చెందిన అమరపు చిన బాబు తన కుమారుడిని తీసుకుని నగర పరిధిలో ఓ ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చి ఆసుపత్రి బయట తన వాహనాన్ని పార్క్ చేసి లోనికి వెళ్లి వచ్చిచూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఉంగుటూరులో వర్షం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఎండలు తీవ్రంగా కాస్తున్న తరుణంలో వర్షం కురవడంతో వాతావరణం కాస్తచల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రైతులకు ఈ వర్షం మేలు చేసినట్లు అయ్యింది. నీరందని చేలకు, బోర్లు లేని రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం పూర్తయినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ఆరోపించారు. ఆ సంఘం ఏలూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సంఘం జిల్లా 6వ మహాసభలను ఆగస్టు 20న ఏలూరులో ఏర్పాటుచేసినట్టు రమణారావు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రక్షణగా ఉండే భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునరిద్దరిస్తామని టీడీపీ కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చి, విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ మేనిఫెస్టోలో పెట్టామని లోకేష్ కార్మికులను నమ్మబలికి ఓట్లు వేయించుకొని, ఇప్పుడు నిర్మాణ కార్మికులు సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు జరక్కుండా ఇచ్చిన 1214 మెమో రద్దు చేసి వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని కోరారు. లేకుంటే సెప్టెంబర్ 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎర్ర రాంబాబు, కోశాధికారి రెడ్డి లక్ష్మణరావు, సభ్యులు తడి సత్యనారాయణ, తెల్లగం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

సాహితీ, సాంస్కృతిక సేవలో శ్రీశ్రీ కళావేదిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సాహితి, సాంస్కృతిక సేవలో శ్రీశ్రీ కళావేదిక ఎప్పుడూ ముందుంటుందని ఆ సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు కార్యక్రమంగా శనివారం నగరంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో సింగర్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాప్ మాట్లాడుతూ శ్రీ శ్రీ కళా వేదిక నిరంతరం కవులు, కళాకారుల ప్రోత్సాహానికి కృషి చేస్తుందని, ఒకే వేదికపై ఇంతమంది గాయనీ, గాయకులు కలవడం ఇదే ప్రథమమని, ఇదో ప్రపంచ రికార్డ్ తెలిపారు. వచ్చే నెలలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో తెలుగు భాషా పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఏర్పాటుచేశామని వెల్లడించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 120 మంది గాయకులు పాల్గొన్నారు. నాన్ స్టాప్ ట్రాక్ సింగింగ్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులకు స్వర కిరీటి బిరుదులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బోళ్ల సతీష్ బాబు, నర్సీపల్లి హారిక, శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం , మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, శ్రీహరికోటి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కత్తిమండ ప్రతాప్

న్యాయం వైపు నిలబడాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేథలిక్ న్యాయవాదులు పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందించడానికి ముందుకు రావాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏపీఎస్ఎస్ఎస్ భవనంలో కేథలిక్ న్యాయవాదులకు జూబిలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిషప్ జయరావు మాట్లాడుతూ కేథలిక్ న్యాయవాదులు న్యాయంవైపు నిలబడి, గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. న్యాయవాదవృత్తిలో నిబద్ధతతో పనిచేసి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్ దున్న రాములు, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రోపర్టీస్ అనే అంశంపై వివరించారు. జస్టిస్ భవన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనె సీతారాం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ బాల, ఫాదర్ ఇమ్మానుయేలు, ఫాదర్ కుమార్, ఫాదర్ జాకబ్, ఫాదర్ బాల స్వామి, 60 మంది కాథలిక్ న్యాయవాదులు పాల్గొన్నారు.



జూబిలీ వేడుకల్లో మాట్లాడుతున్న జయరావు

రావులపర్రు రోడ్డులో చెట్ల నరికివేత

ఉంగుటూరు: మండలంలోని ఉంగుటూరు–రావులపర్రు రోడ్డులో చెట్ల నరికివేతపై పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఉన్న చెట్లు వాహనచోదకులకు నీడనిచ్చేవి. అయితే ఈ చెట్లను ఇటీవల విచక్షణారహితంగా నరికేశారు. చెట్ల నరివేతపై పర్యావరణ ప్రియుడు కొరిపల్లి అప్పారావు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తానని వివరించారు.

ముగిసిన 105వ వేదశాస్త్ర పరిషత్

- ఉత్సాహంగా పాల్గొన్న వేద విద్యార్థులు
- ఉత్తీర్ణులకు సర్టిఫికెట్ల అందజేత

గణపవరం: మండలంలో సరిపల్లెలో తితిదే కల్యాణ మండపంలోని సఖ్యాభివర్ధక నిలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన 105వ వేదపరిషత్ మహాసభ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేద పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులనుద్దేశించి వేదపండితులు, ఘనపాఠీలు పలు సూచనలు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాల నుంచి వేద విద్యార్థులు ఇక్కడ నిర్వహించిన వేద పరీక్షలలో పాల్గొన్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాల్లో ఘనాపాఠీలు పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా తితిదే వేదవిశ్వవిద్యాలయం విశ్రాంత ప్రిన్సిపల్ గుల్లిపల్లి విశ్వనాథ ఘనపాఠీ మాట్లాడుతూ తాను ఐదు దశాబ్దాలక్రితం ఇక్కడికి వచ్చి పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాయనని,ఇక్కడ ఇచ్చే యోగ్యతా పత్రానికి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన వందలాది మంది వేద విద్యార్థులు రాష్ట్రంలోనే కాక దేశ, విదేశాల్లోని పలు ప్రతిష్టాత్మక దేవాలయాలు, వేద పాఠశాలలు, వేద విశ్వ విద్యాలయాలలో పూజారులుగా, అధ్యాపకులుగా, వేద పండితులుగా పని చేస్తున్నారని తెలిపారు. తిరుపతి వేద విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవింద్‌ప్రసాద్ అధికారి మాట్లాడుతూ వేదాలు లోక కల్యాణానికి ఉపయోగపడతాయని, సనాతన ధర్మానికి ప్రతీకలైన వేదాలను పరిరక్షించడానికి మీరంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు మూడు దశాబ్దాలుగా ఆర్థికంగా సహకరిస్తున్న దాత సాగి రాజుసుబ్బరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



వేద పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సూచనలిస్తున్న వేదపండితులు

అర్ధ శతాబ్దం క్రితం పరీక్ష రాశాను



నేను తితిదే వేదపాఠశాల ప్రధానాచార్యునిగా పనిచేసి పదవీ విరమణ చేశాను. 35 సంవత్సరాలుగా ఇక్కడ నిర్వహించే వేద పరీక్షలకు పరీక్షాధికారిగా వస్తున్నాను. కాలం మారుతున్నా, సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతున్నా, మన సంస్కృతీ, సంప్రదాయాలు మరువకూడదు. ముఖ్యంగా వేదాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలి. ప్రస్తుతం 30 మంది వేద విద్యార్థులను కృష్ణయజుర్వేదంలో పరీక్షించాను.

– గుళ్లపల్లి విశ్వనాథ ఘనపాఠీ, హైదరాబాద్

నేపాల్ నుంచి వచ్చి వేద పండితుడిగా..



మాది నేపాల్ దేశం. చిన్నతనంలోనే అస్సాం వచ్చి వేద పాఠశాలలో వేదవిద్యనభ్యసించాను. ప్రస్తుతం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో శుక్ల యజుర్వేదంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. పది మంది వేద విద్యార్థులను మధ్యందిన శాఖలో పరీక్ష నిర్వహించాను.

– గోవిందప్రసాద్ అధికారి, శుక్లయజుర్వేద పరీక్షాధికారి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	28	బీన్సచిక్కుడు	140
వంకాయలు (తెలుపు)	30	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	50	కంద	00
కాకర కాయలు	40	బీట్‌రూట్	38
బీరకాయలు	20	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	26	అల్లం	68-86
క్యారెట్	45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	34	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	01
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	04
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు- బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	11
ఏలూరు- బీహెచ్‌ఈఎల్	21.40	98507	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన మంతెన రామకృష్ణంరాజు శనివారం రూ. 1,00,116 విరాళంగా అందించారని ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ తెలిపారు. తొలుత దాత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని పేర్కొన్నారు.

ప్రతి ఆదివారం హోమం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ప్రతి ఆదివారం హనుమద్ హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ ఆర్‌వీ చందన శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు హోమం ఉంటుందని, పాల్గొన్న దంపతులకు వీఐపీ దర్శనం, వేదాశీర్వాదం కల్పిస్తున్నామని వివరించారు. ఆంజనేయస్వామికి శనివారం సందర్భంగా అభిషేక సేవ చేసినట్టు చెప్పారు. వివిధ సేవలు, విరాళాల ద్వారా ఆలయానికి రూ.1,41,469 ఆదాయం సమకూరిందన్నారు.

గజ్జ పూజ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో ఏలూరుకు చెందిన విష్ణు భజన మండలి సభ్యులు శనివారం గజ్జ పూజ నిర్వహించారు. సుమారు 30 మంది మహిళలు, బాలికలు మండపంలో కూర్చుని గజ్జలకు పూజ లు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, ఆలయ ఆవరణలో తొలి కోలాట నృత్యాలు చేశారు. ఇవి భక్తులను అలరించాయి.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

భీమడోలు: సమష్టి కృషితో కీటక జనిత వ్యాధులను నివారించుకుని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని పూళ్ల ఆరోగ్య విస్తరణాధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. అంబర్‌పేట గ్రామంలో శనివారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి బారిన పడిన తర్వాత కన్నా ముందుగానే పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లె నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, కీటక జనిత ప్రదేశాలను నిలువరించాలని కోరారు. ఇలా చేస్తే దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంలో బిడ్డ ఆరోగ్యానికి టీకా అవసరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు ధనలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ లత పాల్గొన్నారు.



టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ వైవీ లక్ష్మణరావు

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి అమ్మవారి శ్రీనివాసని కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. గిరి ప్రదక్షిన చేసిన భక్తులకు ప్రత్యేక దర్శనం, ప్రసాదం పంపిణీ చేశామని ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. అప్పలరాజుగూడెం చెందిన నాదెళ్ల రాయుడు, ఆయన కుటుంబ సభ్యుల సాయంతో అన్నదానం చేశామని పేర్కొన్నారు. శనివారం వివిధ సేవల రూపేణా ఆలయానికి రూ.1,50551 ఆదాయం వచ్చిందన్నారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందించలేకపోవడంతో పాటు అభివృద్ధి కూడా చేయలేకపోతోందని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. స్థానిక 30, 39 డివిజన్లలో కిలాడీ దుర్గారావు, జ్యోతి ఆధ్వర్యంలో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేపీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని అటకెక్కించిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కూటమి గూండాలతో దాడులు చేయిస్తూ, అక్రమంగా కేసులు పెట్టిస్తున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో నియంతృత్వ పాలనను ప్రజలు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అందక ప్రజలు అల్లాడుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని ఎగవేయడానికి లబ్ధిదారులకు అనేక నిబంధనల అడ్డుగోడ కట్టారని వివరించారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ ఉత్తుత్తి పథకాలని, 18 సంవత్సరాలు నిండిన ఆడ పడుచులకు నెలకు రూ.1500 వేస్తామని నమ్మించి వారి ఉసురు పోసుకున్నారని తెలిపారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం వంటి అనేక పథకాలతో గత ఐదేళ్లుగా ప్రజల చేతిలో ఎప్పుడూ కాసులు గలగలలాడుతూ ఉండేవని, ప్రస్తుతం ఆయా పథకాలను రద్దు చేసి ప్రజల చేతిలో చిల్లిగవ్వ లేకుండా కూటమి నాయకులు పేదలను మరింత పేదలుగా దిగజార్చారని వివరించారు. ప్రజల వద్ద డబ్బులేకపోవడంతో వ్యాపారం లేక వ్యాపారులు డీలా పడుతున్నారని, కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలు ఏడాదిలోనే చవి చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్లెల రవి, లుటుకుర్తి మహేష్, మరడా అనిల్ కుమార్, చిట్టాడ ఠాగూర్, అయినపర్తి శ్యాం, మచ్చిక దుర్గారావు, కనకరాజుతో పాటు పార్టీ నాయకులు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, నెరుసు చిరంజీవులు, మున్నుల జాన్ గురునాథ్, తుమరాడ స్రవంతి, జిజ్జువరపు విజయ నిర్మల, కార్పొరేటర్ డింపుల్ జాబ్ తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు